క్లుప్తంగా

ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీఖాద్రీశుని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఓడీ చెరువు: తంగేడుకుంట గ్రామానికి చెందిన అంజినప్ప (43) ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన భార్య అలివేలమ్మకు వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయం కింద రూ.10వేలను సర్పంచు అబీదాబి, కార్యదర్శి మహమ్మద్‌రఫీ, ఎంపీటీసీ రమణయ్య శనివారం అందజేశారు. సనత్‌కుమార్, రఫిక్, రామాంజి పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

కదిరి అర్బన్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్‌పరిధిలోని కుటాగుళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



బయారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పూల శ్రీనివాస రెడ్డి

నల్లచెరువు: గోరంట్ల పల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బయారెడ్డి (85) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలియగానే సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస రెడ్డి శనివారం గ్రామానికి విచ్చేసి బయారెడ్డికి నివాళులర్పించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీపతి, రాంకిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందాలి



మాట్లాడుతున్న డీఐఓ కృష్ణయ్య

ఎన్‌పీకుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఐఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వ్యాధినిరోధక టీకాల నిల్వలపై వైద్య సిబ్బందితో ఆరా తీశారు. రోజువారి ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యాధికారిణి డాక్టర్ ఆసియా, హెల్త్ ఎడ్యుకేటర్ చంద్రానాయక్, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, ఫార్మసిస్ట్ వరప్రసాద్, ఎల్‌టీ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

తనకల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వామపక్షాలు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమానికి సంబంధించి ప్రచారభేరి పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి కదిరెప్ప మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు గ్రామగ్రామాన పర్యటించి కేంద్రసర్కార్ విధానాలను ఎండగడుతామన్నారు. రెడ్డెప్ప, చౌడప్పయాదవ్, ఇక్బాల్ కరీముల్లా, వీవీ రమణ, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

అండర్-17 క్రికెట్ జట్టు క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న పీసీఎంఆర్ పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: జాతీయ స్థాయి అండర్ -17 క్రికెట్ జట్టుకు స్కూల్ స్పోర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ తరఫున ధర్మవరం మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు యువన్‌కుమార్‌రెడ్డి, శరత్‌సాయి ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్ రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి తెలిపారు. మే 27 నుంచి 29 వరకు ఉత్తరాఖండ్‌లో జరగనున్న క్రికెట్ మ్యాచ్‌లో ఈ విద్యార్థులు పాల్గొంటారన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ప్రిన్సిపాల్ శైలజరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం

- అబద్ధాల చంద్రబాబును నమ్మొద్దు
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

కొత్తచెరువు: సీఎం జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడపగానిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అవ్వా తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు వేయించాలని, పింఛన్లు మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణాలకు రుణాలు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులు నిర్మించుకున్న నూతన గృహాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు కల్లిబొల్లి మాటలతో రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసి నేడు నిజాయితీపరులమంటూ ప్రచారం చేసుకుంటున్నారని, ఇలాంటి అబద్ధాల చంద్రబాబును నమ్మవద్దని ప్రజలకు సూచరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి , జెడ్పీటీసీ గంగాదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్‌లు అలివేలమ్మ, నరేంద్ర రెడ్డి, ప్రకాష్, ఎంపీటీసీలు, వరలక్ష్మి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, దాల్‌మిల్ సూరి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, మటన్ శంకర్, నరసింహారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సాయిలీల, సురేంద్ర రెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, పోతిరెడ్డి, తిప్పారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పేయింటర్ కేశవ, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ భాస్కర్, గిరి, సుబ్బారావు, అయుబ్ ఖాన్, షాన్‌షేట్, జాకీర్, వెంకటరాముడు, యల్లప్ప, అశోక్, యుగంధర్, తిప్పారెడ్డి, మున్వర్ పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కొత్తచెరువు: కొడపగానిపల్లి గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అయ్యేలా పనిచేయాలని ఉద్యోగులకు ఎమ్మెల్యే సూచించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అమడగూరు: మండలంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు రెడ్డివారిపల్లి, 8.30 గంటలకు పత్రవాండ్లపల్లి, 9 గంటలకు తనకంటివారిపల్లి ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అనంతరం జేకేపల్లి పంచాయతీలోని ఇద్దేవాండ్లపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొత్తచెరువు: కొత్తచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయుడు వాల్మీకి శంకర్ ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శనివారం వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నాయనపల్లిలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై వివరిస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

తాడిమర్రి: ఎండలు మండుతున్నందున వడదెబ్బ సోకకుండా జాగ్రత్త పడాలని డాక్టర్ జ్యోతిర్మయి గ్రామస్తులకు సూచించారు. నాయనపల్లి, మర్రిమాకులపల్లి గ్రామాల్లో శనివారం ఆమె వైద్య సిబ్బందితో కలసి గ్రామస్తులకు ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందించారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేసి, వైద్య చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు యోగా, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఎండల్లో తిరిగినా, పనిచేసినా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలన్నారు. బయటకు వెళ్లే ముందు ద్రవపదార్థాలు ఎక్కువ తీసుకోవాలన్నారు. తల తిరగడం, వాంతులు, విరోచనాలు, తలనొప్పిగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే వారిని నీడలోకి తరలించాలన్నారు. మంచి నీరు, లేదా మజ్జిగ తాపించి ఒళ్లంతా తడిగుడ్డతో తుడిచి గాలి తగిలేలా చూడాలన్నారు. అనంతరం బాధితులను డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. నాయనపల్లి, దాడితోట గ్రామాల్లో వైద్య సిబ్బంది మిలాథిన్ పిచికారీ చేయించారు.

ముదిగుబ్బ: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాళ్లఅనంతపురం గ్రామంలో డాక్టర్ రాజేంద్ర శనివారం పర్యటించారు. రోగులకు వైద్య సేవలు అందించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నకే పట్టం కడతాం



ధర్మవరం: అభిప్రాయాలు సేకరిస్తున్న చందమూరి నారాయణరెడ్డి



నల్లమాడ: 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు



బత్తలపల్లి: చెన్నరాయపట్నంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బగ్గిరి బయపరెడ్డి తదితరులు

• 'జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన

ధర్మవరం: ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్న పాలన ఎంతో బాగుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి నీరాజనం పడుతున్నారు. మళ్లీ సీఎంగా జగనన్నకే పట్టం కడతామని నినదిస్తున్నారు. శనివారం ధర్మవరంలోని కొత్తపేట, టీచర్స్ కాలనీల్లో సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం జగనన్న స్టిక్కర్‌ను ఇళ్లవద్ద అతికించారు. వార్డులో ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. మరోమారు జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తామని అన్నారు. చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ వంద శాతం హామీలను అమలు చేసి లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాల ద్వారా నగదు జమ చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు నిదర్శనమన్నారు. చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు జింకా కంబగిరి, మల్లికార్జున పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని దొన్నికోట పంచాయతీ గూడమేకలపల్లిలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ప్రజలు 82960 82960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. నాయకులు గెంగినాయుడు, నాగరాజునాయుడు, కమలాకర్‌నాయుడు, కాయల శివన్న, నాగరాజు, శీనా, గంగయ్య, నరసింహులు, సుబ్బన్న, గంగాధర్, గృహ సారథులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: చెన్నరాయపట్నం, పోట్లమర్రి గ్రామాల్లో సర్పంచులు మొర్రెడ్డిగారి శారదమ్మ, అక్కిం దామోదర్‌తో కలిసి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి 'నువ్వే మా నమ్మకం జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడా గుర్తించాలని ప్రజలకు సూచించారు. సంక్షేమ పథకాలతో ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్న సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను సీఎంగా అవకాశం ఇవ్వాలన్నారు. కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలన్నారు. ఈశ్వర్‌రెడ్డి, లింగమయ్య, ఈశ్వరయ్య, హరినాథ్, పోట్లమర్రి హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని పి.కొత్తపల్లి, దేవిరెడ్డిపల్లి,గ్రామాలలో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి ఎంపీటీసీ జొన్నా సుజాత, డైరెక్టర్ ఆదిమూర్తి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగభూషణ, రామిరెడ్డి, నజురుల్లా, గృహసారథులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: యర్రపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. జగనన్న పాలనపై అభిప్రాయాలు సేకరించారు. సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పారెడ్డి, నాయకులు నంజిరెడ్డి, రామచంద్ర, అనిల్, దస్తగిరి, ఇంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తాడిమర్రి: నార్శింపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ మంజులా నారాయణస్వామి వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులతో కలసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. నరసింహుడు, రామకృష్ణ, ఓబిలేసు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన భోజనాలు



వనభోజనాలు ముగించుకొని వస్తున్న గ్రామస్తులు



కనగానపల్లి: చెట్ల కింద ఊయల ఊగుతూ ఉల్లాసంగా గడుపుతున్న పిల్లలు, పెద్దలు

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి గ్రామంలో శనివారం గ్రామస్తులు వన భోజనాలకు తరలి వెళ్లారు. దీంతో మొత్తం ఖాళీగా మారింది. శ్రీరామనవమి, అక్కమ్మగారి జాతర అనంతరం వన భోజనాలకు వెళ్లడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం ఉదయాన్నే ఇళ్లకు తాళాలు వే సి వంట సరుకులతో గంపలు తలపై ఎత్తుకుని, పశువులను తీసుకుని పిల్లపాపలు, వృద్ధులతో సహా పొలాల వద్ద చెట్ల కిందకు చేరారు. అనంతరం పిండి వంటలు చేసుకుని ఆరగించారు. సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి బొడ్రాయికి బిందెడు నీరు పోసి ఇళ్లలోకి వెళ్లారు.

కనగానపల్లి: మామిళ్లపల్లి గ్రామస్తులు శనివారం వన భోజనాలకు వెళ్లారు. ఉదయమే వంట సామగ్రి తీసుకొని గంపల్లో ఉంచుకొని ఊరు బయట చెట్లకిందకు వెళ్లారు. అక్కడే వంట చేసుకొని డే సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సరదాగా గడిపి గంపలు ఎత్తుకొని ఊర్లోకి ఊరేగింపుగా చేరుకున్నారు.

నూతన ఎస్పీకి శుభాకాంక్షలు



ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డిని శాలువతో సత్కరిస్తున్న ఆవుటాల రమణారెడ్డి



ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.రమణారెడ్డి

కొత్తచెరువు: జిల్లా నూతన ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డిని శనివారం జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.

నల్లచెరువు: ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌వీ మాధవరెడ్డిని పంచాయతీ రాజ్ జోనల్ ఇన్‌చార్జ్ కె రమణారెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రొళ్ల ఎంపీపీ విజయరంగే గౌడ్, సర్పంచ్ ప్రకాష్ ఉన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

నల్లమాడ: బసిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాజారెడ్డి తండ్రి ఏ.రామచంద్రారెడ్డి(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి రామచంద్రారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మెన్ రఘునాథరెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు ఏ.గంగిరెడ్డి, సర్పంచ్ కుళ్లాయప్ప, నాయకులు అరవిందరెడ్డి, చిన్నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జి. గీతావాణి

ధర్మవరం రూరల్: లైంగిక దాడులపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జి. గీతావాణి సూచించారు. మోట్లుమర్ల వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హక్కులపై జడ్జి అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్‌ను తనిఖీ చేసి సదుపాయాలు, ఇబ్బందులపై ఆరా తీశారు. న్యాయవాది బాలసుందరి, ప్రిన్సిపాల్ చంద్రకళ పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలకు చెక్



పుట్టపర్తిటౌన్: గణేష్ కూడలిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కదిరిలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: అవగాహన, జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఏడీఎఫ్‌ఓ నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పుట్టపర్తి పట్టణంలోని హనుమాన్ కూడలిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ, గడ్డి వాములకు నిప్పంటుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక సిబ్బంది చేసి చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కోసారి చిన్నప్రమాదాలు పెద్దవై భారీ నష్టం జరుగుతుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

కదిరి అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగిఉంటే ప్రాణ నష్టం, ఆస్తినష్టం నివారించవచ్చని ఫైర్‌ఆఫీసర్ మన్సూర్ పేర్కొన్నారు. సిబ్బంది శ్రీధర్, శ్రీనివాసులు, చిరంజీవి, రమేష్‌రెడ్డి, దస్తగిరి, రమణప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని ఈజీబై, రిలయన్స్‌ట్రెండ్స్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి రాజు అవగాహన కల్పించారు.

భూసార పరీక్షతో అధిక దిగుబడి



తలుపులలో భూసార పరీక్షల దృశ్యం

ఎన్‌పీకుంట: భూసార పరీక్షలతో అధికదిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. భూసార పరీక్షలకు మట్టి సేకరణపై స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఆర్బీకే సిబ్బందికి శనివారం ఆయన శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆర్బీకే సిబ్బందిని పొలానికి తీసుకెళ్లి మట్టినమూనాల సేకరణను ప్రయోగాత్మకంగా చూపించారు. భూసార పరీక్షలతో నేలలో భూమిలో పోషకాల లోపం, నేల స్వభావం, స్థూల, సూక్ష్మ పోషకాలు, ఖనిజ లవణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుందన్నారు. వాటి ఆధారంగా పోషకాలు అందిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. ఏఈఓ శిరీష పాల్గొన్నారు.

తలుపుల: భూసార పరీక్షలపై ఏఓ షాదాబ్ వ్యవసాయ వీఏఏ, వీఎస్ఏ, వీహెచ్ఏలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలాలకు తీసుకెళ్లి మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు.

చెన్నేకొత్తపల్లి: ఖరీఫ్ ప్రారంభమయ్యేలోపు పొలాల్లో భూసార పరీక్షలు చేయాలని ఏఓ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏఓ కార్యాలయంలో భూసార పరీక్షలపై వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అనంతరం చెన్నేకొత్తపల్లి గ్రామ సరిహద్దు పొలాల్లో భూ సార పరీక్షలను ఏ విధంగా చేయాలనే విషయాన్ని వివరించారు. ఏఈఓ రియాజ్ పాల్గొన్నారు.

పుట్టపర్తి: ప్రతి రైతూ తమ పొలంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని బుక్కపట్నం మండల వ్యవసాయాధికారి సతీష్, కొత్తకోట సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ సూర్యనారాయణ సూచించారు. శనివారం రైతులను పొలాలకు తీసుకెళ్లి మట్టి నమూనాలపై అవగాహన కల్పించారు. ఏఈఓ సుధ పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

తనకల్లు: తెలిసీ తెలియని తనంతో చిన్నారి చేసిన పనికి బాలుడు గాయపడ్డాడు. ఈ ఘటన ఎగువ బత్తినవారిపల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన రమేష్ కుమారుడు రాహుల్ స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో కార్యకర్త సుజాత పిల్లల హాజరుకు సంబంధించిన ఫొటో అప్‌లోడ్ చేయడానికి బయటకు వెళ్లింది. ఆ సమయంలో రాహుల్ అల్లరి చేస్తున్నాడని ఎనిమిదేళ్ల చిన్నారి అక్కడే వేడిగా ఉన్న పప్పుపాత్రలోని స్పూన్ తీసుకొని బాలుడి చేతిపై పెట్టింది. బొబ్బలు వచ్చి గాయాలయ్యాయి. ఈ విషయం తమ దృష్టికి వచ్చినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

ఎన్‌పీకుంట: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం చివరిగా సోషియల్ పరీక్ష జరిగింది. పరీక్షలు ముగియడంతో విద్యార్థుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. చివరి రోజు పరీక్ష కేంద్రాలనుంచి బయటకు రాగానే విద్యార్థులు బైబై చెప్పుకుంటూ ఇళ్లకు వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా స్థానిక పరీక్షా కేంద్రాన్నితహసీల్దార్ రవినాయక్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.

హుండీ లెక్కింపు

అమడగూరు: అమడగూరులో కొలువైన చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు ముగియడంతో ఆలయ హుండీని శనివారం ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ 4.68 లక్షల ఆదాయం లభించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

తలుపుల: మండలంలోని శ్రీశ్రీ ఓబుళేశ్వరస్వామి మాన్యం భూములు కౌలుకు ఇచ్చేందుకు శనివారం ఎండోమెంట్ అధికారి నరసింహరాజు, ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 12 మంది పాల్గొన్నారు. 66 ఎకరాలు ఏడాదికి రూ.1,50,000తో కొత్తపూలవాండ్లపల్లి గుర్రయ్య వేలం దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ మల్లికార్జున, ఎస్ఐలు మగ్బుల్ బాషా, మల్లికార్జునరెడ్డి, రూరల్, టౌన్ సీఐలు శివశంకర్ నాయక్, తమ్మిశెట్టి మధు పాల్గొన్నారు.

విద్యతో ఉత్తమ భవిష్యత్

ధర్మవరం అర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్యతో మంచి భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టూటౌన్ సీఐ రాజా, విశ్రాంత ఎంఈఓ చిన్నపరెడ్డి అన్నారు. ధర్మవరం పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులోని రిజ్వాన్స్ విశ్వభారతి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వార్షికోత్సవం, చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కష్టపడి, ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ షేక్ శేకున్, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం కోసమే పథకాలు



కనగానపల్లిలో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



మామిళ్లపల్లిలో వైఎస్సార్ విగ్రహ వద్ద థ్యాంక్యూ సీఎం సార్.. అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

కనగానపల్లి: మహిళల సంక్షేమం కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. కనగానపల్లి, మామిళ్లపల్లి, తగరకుంట గ్రామాల్లో ఈబీసీ నేస్తం కింద అర్హత పొందిన లబ్ధిదారులు శనివారం సంబరాలు చేసుకున్నారు. కనగానపల్లి సచివాలయం వద్ద ఎంపీపీ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అమరనాథరెడ్డి, నాగముని, ప్రభాకర్, వలగొండ భాస్కర్, అంకె రామక్రిష్ణ, అశోక్ పాల్గొన్నారు.